

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల: కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ బుధవారం తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవర్నర్‌కు టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి ప్రసాదం, టీటీడీ క్యాలెండర్, ఫొటోను అందజేశారు. అలాగే కేంద్ర పర్యాటకశాఖ మంత్రి సురేష్ గోపి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత స్వామివారి దర్శనానికి కుటుంబంతో కలిసి వచ్చానని పుష్కరకాలం తర్వాత స్వామిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు. దేశంలో పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేరళలో పర్యాటక రంగం తిరిగి పుంజుకుంటోందని తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి మొత్తం కలియ తిరిగి చికిత్స ఎలా ఉంది..? డబ్బులు ఏమైనా తీసుకుంటున్నారా..? ఆస్పత్రి ద్వారా అందిస్తున్న భోజనం ఎలా ఉందని రోగులను ఆరా తీశారు. సర్జరీలు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద చేస్తున్నారా..? అని రోగులను అడుగగా వారు ఎన్టీర్ ఆరోగ్యశ్రీ కింద సర్జరీ చేశారనీ, మెరుగైన వైద్యం అందిస్తున్నారని సమాధానం ఇవ్వడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం లేబరేటరీని పరిశీలించి ఆధునిక పరికరాలు, తదితర ఎక్విప్మెంట్లు, రక్తపరీక్షల సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి జనరేటర్ చాలా కాలం నుండి పనిచేయడం లేదని తెలుపగా, ఎమ్మెస్ఐడిసి అధికారికి కలెక్టర్ ఫోన్లో మాట్లాడి వారంలోపు జనరేటర్ మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే కంటి ఆపరేషన్లు చేసే సీనియర్ కంటి వైద్యాధికారి అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఆప్తాల్మిక్ ఓటి సేవలు కంటి శాస్త్ర చికిత్సలు ఈనెల 20వ తేదీ నుండి అందుబాటులోకి రావాలని ఆదేశించారు. డెంటల్ ఇంప్లాంట్ కొరకు వైద్యాధికారుల కొరత పరికరాలు కావాల్సి ఉన్నాయని తెలుపగా కలెక్టర్ దానిపై సానుకూలంగా స్పందించి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచనలు చేశారు. జనరల్ మెడిసిన్ వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం డిప్యూటేషన్ చర్యలు తీసుకోవాలని డిసిహెచ్ఎస్‌కు సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో మధు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో 'మలమూత్రాలు'

● దెబ్బతింటున్న నది పవిత్రత, భక్తుల మనోభావాలు

నదిలోకి మురుగును వదులుత్తున్న ట్యాంకర్లు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

సద్యోముక్తి క్షేత్రంగా.. దక్షిణ కాశీగా.. విరాజిల్లుతున్న ముక్కంటీశుని పాదాల చెంత ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదికి ఎంతో ప్రత్యేకత, పవిత్రత ఉంది. అన్ని నదులకు పన్నెండేళ్లకోసారి పుష్కరాలు వస్తే స్వర్ణముఖీ నదికి మాత్రం ఏడాదికోసారి పుష్కరాలు నిర్వహించడం ప్రత్యేకత. భగీరథ మహర్షి కఠోర తపస్సుకు మెచ్చి సాక్షాత్తు గంగమ్మే స్వర్ణముఖీ నదిగా ఇక్కడ ప్రవహించిందని స్థలపురాణం చెబుతోంది. అంతటి పవిత్రత కలిగిన స్వర్ణముఖి నదిని కొందరు వ్యక్తులు అపవిత్రం చేస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం ద్వారా వచ్చిన మలమూత్రాలను ట్యాంకర్ల దారా తీసుకొచ్చి నదిలో పారబోస్తున్నారు. ఇదంతా శ్రీకాళహస్తీశ్వరాలయానికి కూతవేటు దూరంలోనే జరుగుతున్నా ఆలయ అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఇదే ప్రాంతంలో ఆలయ అధికారులు ప్రతిఏడాది పవిత్రోత్సవాలు కూడా నిర్వహిస్తుంటారు. కొందరు వ్యక్తులు తమ వ్యాపార అభివృద్ధి కోసం నది పవిత్రతను పాడు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పై విమర్శలు వస్తున్నాయి. దక్షిణ కాశీగా పేరుగాంచిన స్వర్ణముఖి నదిలో స్నానమాచరిస్తే సకల పాపాలు పోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అయితే వారి కళ్లెదుటే మలమూత్రాలను ట్యాంకర్ల ద్వారా నదిలోకి విడుదల చేస్తుండడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇకనైనా ఆలయ అధికారులు స్పందించి సెప్టిక్ ట్యాంకుల ద్వారా సేకరించే మలమూత్రాలను నదిలో పారవేయకుండా అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీచర్‌గా మారిన కలెక్టర్

ట్యాబ్‌లో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- రేణిగుంట: ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద ఎంపికైన రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పథకం అమలు తీరుబాగుందని, స్ఫూర్తిదాయకంగా ఉందని, మరింతగా మెరుగుదలతో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు మరిన్ని బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేయాలని అన్నారు. అనంతరం సబ్జెక్ట్ ట్యాబ్‌లోని కంటెంట్ అర్థమవుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కొంత సమయం విద్యార్థులు విద్యాబోధన చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ఆట స్థలాన్ని పరిశీలించి ఎన్ఆర్ఎస్ జిఎస్ అనుసంధానంతో చేపట్టాల్సిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పిడికి తెలిపారు. ఇంటర్మీడియేట్ వారికి సంబంధించిన సైన్స్ ల్యాబ్, ఐఎఫ్‌బి సబ్జెక్ట్ సమాచారాన్ని పరిశీలించి బాగుందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంను డీఈఓ శేఖర్‌తో కలిసి తిని భోజనం శుచి చూశారు. మరుగుదొడ్లను, ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించారు. విలేకర్లతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద ఎంపిక చేయబడిన పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, నాణ్యమైన విద్యకు సంబంధించి బలోపేతం చేసే దిశగా భారత ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పిల్లలకు మంచి విద్యను, నాణ్యతగా, మౌలిక వసతులతో, లైబ్రరీ, లాబోరేటరీ వంటి ఏర్పాట్లతో అందించే దిశగా మన జిల్లాలో ఎంపిక అయిన 40 పాఠశాలలు బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేస్తూ విద్యాశాఖ జిల్లాలోని 40 పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన వినూత్న బోధనా పద్ధతులతో, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, క్రీడలు నిర్వహణతో, మౌలిక సదుపాయాల మెరుగుదలతో, కెమిస్ట్రీ ప్రయోగశాలలు తదితర ఏర్పాటు, విద్యార్థులకు స్పష్టంగా అర్థమయ్యే రీతిలో వారికి నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులోని ఉత్తమ పాఠశాలలు ప్రధానమంత్రి అవార్డుకు ఎంపిక అవుతాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణు వర్ధనం, ఆర్డీఓ శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి, నోడల్ అధికారి పిఎం శివశంకర్, డిప్యూటీ విద్యాధికారి బాలాజీ, కేవికె రాస్ హెడ్ డాక్టర్ శ్రీనివాస్, సర్వశిక్షా ప్లానింగ్ అధికారి రామచంద్ర రెడ్డి, సిఎంఓ, రేణిగుంట తహశీల్దార్ సురేష్, ఎంపిడిఓ విష్ణు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ వెరిఫికేషన్ సర్వే

బిఎల్‌ఓలు ఎస్ఎస్ఆర్ -2025 తయారీ నేపథ్యంలో ఇంటింటికీ తిరిగి సర్వేను పక్కాగా నిర్వహించి లోపాలు లేని, పారదర్శకమైన ఫోటో ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రేణిగుంట మండలం స్థానిక పాంచాలి వీధిలో బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్ -2025 ఇంటింటి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పక్కాగా ఇంటింటి ఓటర్ జాబితా వెరిఫికేషన్ నిర్వహించి లోపాలు లేని ఫోటో ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలని, ఏదైనా పొరపాట్లు వస్తే సంబంధిత అధికారి బాధ్యులవుతారని తప్పకచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇంటిలోని వారి పీఎస్ఈ, డీఎస్ఈ ఓటర్ వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని అందులోని ఫోటో ప్రస్ఫుటంగా కనిపించేలా ఉందా అని చూసి అవసరమైతే మరొకసారి ఫోటో సేకరించాలని, కుటుంబంలోని సభ్యుల వివరాలు సరిచూసుకుని వారిలో ఎవరైనా మరొక పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంటే వారితో మాట్లాడి వారి అంగీకారం మేరకు ఒక చోట తొలగించి కుటుంబసభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా నిర్దేశిత ఫారంలో వివరాలు నింపిన మేరకు చర్యలు తీసుకోవాలని, లోపాలు లేని డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ తయారు కావాలని సూచించారు. ఆర్డీఓ శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి, తహశీల్దార్ సురేష్, ఎంపిడిఓ విష్ణు, గ్రామవార్డు బిఎల్‌ఓలు అధికారులు పాల్గొన్నారు.

రుయాలో నర్సుల నిరసన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి రుయా ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న జిఎన్ఎం, బిఎస్‌సి నర్సులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నర్సులకు ఇబ్బందులు కలిగించేలా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 115 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక రుయా ఆస్పత్రి పరిపాలన భవనం వద్ద నర్సులు విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏఎన్ఎంలకు ఎనిమిది నెలలు శిక్షణ ఇచ్చి, జిఎన్ఎంలుగా పదోన్నతి ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో నెంబర్ తీసుకొచ్చిందన్నారు. కోర్టు ద్వారా దాన్ని రద్దు చేయిచ్చామని, ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం తిరిగి మళ్లీ అదే జీవోను విడుదల చేసి, ఏఎన్ఎంలకు శిక్షణ ప్రారంభించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి దీనిని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అశ్విన్ రెడ్డి, రవీంద్ర నాయక్, మాధవి, సౌందల, నర్మదా, కవిత, జిఎన్ఎం, బిఎస్‌సి నర్సులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి నిధులు

కేంద్రమంత్రి సురేష్ గోపి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి పరిచేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని కేంద్ర పెట్రోలియం, పర్యాటక శాఖ మంత్రి సురేష్ గోపి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టిడిపి నేత రంగినేని చెంచయ్య నాయుడు సురేష్ గోపికి ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. స్వామీఅమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి వద్ద వేదపండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలను అందజేశారు. అనంతం బిజెపి, టిడిపి నేతలు శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి రూ.140 కోట్లు, గుడిమల్లం పరుశురామేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 22 కోట్లు కావాలని ప్రతిపాదన పెట్టగా మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా సాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు.

ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం ర్యాలీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్ విఎంసి ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు బుధవారం రుయా ప్రాంగణం నుంచి ఎస్‌వి వైద్యకళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబరు 10 నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించడానికి 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమం, పిల్లల్లో ఆత్మహత్య నివారణ తగ్గించడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఈ ఏడాది ఒక వారం రోజులు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మొదటిరోజు రోల్ ప్లే, రెండో రోజు ర్యాలీ, మూడో రోజు వెబ్నార్, నాలుగో రోజు సెమినార్, ఐదో రోజు వ్యాసరచన పోటీలు, ఆరవ రోజు పోస్టర్ ప్రజెంటేషన్, ఏడవ రోజు ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ జనరల్ హెల్త్ సర్వీస్ మినిస్ట్రీ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ న్యూఢిల్లీ ఆన్లైన్ వెబినగర్ నిర్వహించారు. డాక్టర్లు కవిత, జాహ్నవి, మానస, పవన్, మురళీ నాయక్, రోహిత్, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి: డీసీఓ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతివిద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు లక్ష్యం చేరేలా గుణాత్మక విద్యను అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి టి.పద్మజ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆమె స్థానిక కాసాగార్డెన్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వంటశాలను, తరగతి గదులను, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను వెలికి తీసే ప్రయత్నం చేసి సంతృప్తి వ్యక్తపరిచారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమై ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిసారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యచరణ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా 9, 10, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేలా చొరవ చూపాలని సూచించారు.

పెట్టుబడి సాయమేది చంద్రబాబు : రైతు సంఘం



సచివాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయింది. మరి రైంతాగానికి ఇస్తానన్న రూ.20 వేలు పెట్టుబడి సాయమేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత ప్రశ్నించారు. రైంతాంగం సమస్యలు, గత ఎన్నికల హామీల అమలుపై స్థానిక ఎస్డీకే నగర్ సచివాలయం వద్ద రైతు సంఘం నాయకులు బుధవారం నిరసన తెలియజేశారు. అనంతరం హేమలత మాట్లాడుతూ గత ఎన్నికల్లో రైతులు, కౌలు రైతుల మద్దతుతో ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అయితే రైతులకు అండగా ఇస్తానన్న పెట్టుబడి సాయాన్ని ఇంతవరకు విడుదల చేయలేదని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకం కార్యచరణ కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం బాధాకరమని ఆవేదన చేశారు. చంద్రబాబు పెట్టుబడి సాయాన్ని విడుదల చేసి ఉంటే రైతులు, కౌలు రైతులు పెట్టుబడి కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. అంతేకాకుండా 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో కరువు, తుఫాన్‌లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలనీ, సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల వరకు రైతుల రుణాలు రద్దు చేయాలనీ, వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టే జీఓ 22 రద్దు చేయాలని కోరారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గూడూరు పరిధిలో మల్లిపల్లి మడుగు ప్రాజెక్టు, శ్రీకాళహస్తి పరిధిలో సోమశీల స్వర్ణముఖి ప్రాజెక్టు పూర్తిచేసి శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల ప్రజలకు తాగు, సాగునీరు అందిచాలని సూచించారు. పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టు మరమ్మతులకు జైకా నిధులను కేటాయించి సత్వరం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కెవిబిపురం మండలంలో ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగునీరు అందించాలనీ, తలకోన నీటిని వృథా కాకుండా సమీప చెరువులకు మళ్లించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. పాడి రైతులకు శ్రేయస్కరంగా ఉండే గొర్రెలు, మేకలు, పశువుల షెడ్లను పార్టీలకతీతంగా నిర్మించే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రతి పంచాయతీలో కల్లాలు, నిల్వ చేసుకోవడానికి గోదాములు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి 300 సర్వీసులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అక్టోబర్‌లో నిర్వహించే తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి ఏపీఎస్ ఆర్టీసీ తమిళనాడు ఆర్టీసీకి చెందిన 300 బస్ సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. స్థానిక జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో టీఎన్ఆర్టిసి, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే బస్ సర్వీసులపై బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ నుంచి 150 బస్ సర్వీసులు, తిరుపతి చెన్నై వయా ఊతుకోటపై 30 సర్వీసులు, తిరుపతి- కంచి 20, తిరుపతి- చెన్నై వయా శ్రీకాళహస్తి 5, తిరుపతి తిరునామలై 10, తిరుపతి వేలూరు 65, తిరుపతి- క్రిష్ణగిరి 15, తిరుపతి- హొసూర్ 5 సర్వీసులు నడపనున్నారు. తమిళనాడు ఆర్టీసీ ఆధ్వర్యంలో కల్లకరిచి తిరుపతి మధ్య 10, విల్లుపురం -తిరుపతి 8, పాండిచ్చేరి- తిరుపతి 10, వేలూరు - తిరుపతి 25, తిరుపత్తూరు- తిరుపతి 10, తిరునామలై - తిరుపతి 8, చెన్నై - తిరుపతి వయా తిరుత్తని మీదుగా 18, చెన్నై- తిరుపతి శ్రీకాళహస్తి మీదుగా 10, కాంచీపురం -తిరుపతి 9, తంబ్రాంమ్ 4, సేలం -తిరుపతి 4, తిరుపతి -తిరుచి వయా వేలూరు 2, కోయంబత్తూర్ - తిరుపతి 4, కుంభకోణం తిరుపతి 2, తంజావూరు -తిరుపతి 2, తిరుచి -తిరుపతి వయా చెన్నై మీదుగా 2, నాగపట్నం -తిరుపతి 3, క్రిష్ణగిరి -తిరుపతి 5, హొరూరు -తిరుపతి 06, హొసూరు -తిరుపతి మధ్య 2 రెండు సర్వీసులు నడిపేలా రెండు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఆర్ఎం. చంగల్ రెడ్డి, డిప్యూటీ సిటిఎం భాస్కర్ రెడ్డి, అలిపిరి, తిరుపతి, మంగళం డిపోల డిఎం లు, తమిళనాడుకు చెందిన ఆర్టీసీ అధికారులు మోహన్, గుణశేఖరన్, గణపతి, సెల్వం, మనీ, నటరాజన్, మంజునాథన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.20 లక్షలు విరాళం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: విజయవాడ వరద బాధితుల కోసం శ్రీకాళహస్తి రైస్ మిలర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం రూ.20 లక్షల విరాళాన్ని మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ. 2 కోట్ల మేర విరాళాలు అందివ్వనున్నట్లు ఇటీవల ఎమ్మెల్యే హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఆయన మంగళవారం రూ.75లక్షల చెక్కును నేరుగా సీఎం చేతికి అందివ్వగా, బుధవారం రూ.20లక్షల చెక్కును మంత్రి లోకేష్‌కు అందించారు.

హెడ్ కానిస్టేబుల్ రూ.20వేలు సాయం



ఎస్పీకి విరాళం అందిస్తున్న కానిస్టేబుల్ శంకర్ రెడ్డి

తిరుపతి సిటీ : తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, తిరుపతి జిల్లా పోలీస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, స్టేట్ పోలీస్ అసోసియేషన్ గౌరవ సలహాదారులైన జి.శంకర్ రెడ్డి విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం రూ.20,000ల డిమాండ్ డ్రాప్‌ను జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడుకు అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం విజయవాడ ప్రజలకు సహాయం చేయాలని మంచి ఉద్దేశంతో ముందుకు వచ్చి తనవంతు బాధ్యతగా బుధవారం రూ.20వేలు విరాళంగా అందజేయడం చాలా అభినందనీయమన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జె.వెంకట్రావు, తిరుపతి పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, అభినందించారు.

వరద బాధితులకు చేయూతనివ్వండి: సిపిఎం

సత్యవేడులో..

సత్యవేడు: విజయవాడ వరద బాధిత కుటుంబాలకు చేయూతనివ్వాలని, విరాళాలు అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. విజయవాడలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం సాయం అందించాలని కోరారు. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు మరింత వేగవంతం చేయాలని కోరారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. నాయకులు మురళి, క్రిష్ణయ్య, సెల్వం, శేఖర్, మునస్వామి, తిరుమల రెడ్డి, సుశీల, బాబు పాల్గొన్నారు.

క్యాంపస్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వర్సిటీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్నటువంటి ఉద్యోగస్తులు, విశ్రాంతి ఉద్యోగస్తుల జీతభత్యాల్లో నుంచి ఒకరోజు బేసిక్ పేను కట్ చేసుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించవలసినదిగా వినతిపత్రం ఇచ్చారు. నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పీకే సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి ఎన్.సుబ్రహ్మణ్యం, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ఘంటసాల సినిమాకు

వినోదపు పన్ను రాయితీ ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తెలుగువారు మరచిపోలేని మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుపై నిర్మించిన సినిమాపై వినోదపు పన్ను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఘంటసాల సినిమాను సిహెచ్ రామారావు నిర్మించగా, అత్యంత సామాన్యుడైన సిహెచ్ పవన్ అనే వ్యక్తి ఘంటసాలపై ఉన్న అభిమానంతో తన రిటైర్మెంట్ డబ్బులు వెచ్చించి సినిమాను అద్భుతంగా తీశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు సినిమాను రిలీజ్ చేయడానికి కూడా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారని ఇలాంటి సినిమాలను ప్రభుత్వమే బాధ్యత తీసుకొని విడుదల చేయాలని కోరారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ఐదు భాషలలో తన మధుర కంఠాన్ని వినిపించారని అలాంటి గాయకుడిపై తీసిన చిత్రం విడుదలకు నోచుకోకపోవడం సమంజసం కాదని, ఆయనకున్న గౌరవాన్ని కాపాడాలని, తెలుగువారు ప్రతినిత్యం స్మరించుకునే వ్యక్తి ఘంటసాల అని ఆయన గుర్తు చేశారు. ఘంటసాల పాడిన పాటలు ప్రతినిత్యం తిరుమల కొండపై మార్మోగుతుంటాయని టీటీడీ ఆస్థాన విద్వంసకుడిగా పనిచేసిన ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రానికి టీటీడీ లాంటి సంస్థలు తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హరిబాబుకు 'దళిత వీర్' అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, దళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కో-ఆర్డినేటర్ నత్తం హరిబాబు ప్రతిష్టాత్మక 'దళిత వీర్' అవార్డును అందుకున్నారు. గుంటూరులోని అరండల్ పేట ఎస్సి, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన 'దళిత పల్లెవీరుల మహోత్సవం'ను పురస్కరించుకుని హరిబాబుకు అవార్డును అందజేయడం జరిగింది. చుండూరు దళిత పోరులో అమరుడైన కొమ్మెర్ల అనిల్ కుమార్ స్ఫూర్తితో దళిత, మానవ హక్కుల పరిరక్షణకు అంకితభావంతో విశేష కృషి చేస్తున్న దళితులకు ఈ 'దళిత వీర్' అవార్డును ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నారు. ఆ కోవలో తన వంతు కృషి చేస్తూ దళిత బాంధవుడు అంబేడ్కర్ భావజాలంతో ముందుకెళ్తున్న హరిబాబుకు 'దళిత వీర్' అవార్డును బహూకరించడం జరిగింది. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, మాజీ మంత్రి డొక్కామాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా హరిబాబు అవార్డును అందుకున్నారు. హరిబాబుకు 'దళిత వీర్' అవార్డు రావడం పట్ల పలువురు సీనియర్ పాత్రికేయులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు భూపతి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

రూ.3.10 లక్షలు పలికిన లడ్డు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థలో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య, కార్పొరేటర్ ఆర్‌సి.మునికృష్ణ పూజలు నిర్వహిచి అనంతరం స్వామి వారి వద్ద ఉంచిన లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఇంజినీరింగ్ విభాగం వారు రూ.3.10లక్షల హెచ్చు పాటపాడి లడ్డును దక్కించుకున్నారు. ఇంజినీరింగ్ విభాగపు అధికారులకు మేయర్, కమిషనర్ లడ్డును అందజేశారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఐదు రోజులు పాటు ఘనంగా పూజలు నిర్వహించామన్నారు. ఐదవ రోజు బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలు అందరూ జాగ్రత్తగా నిమజ్జన వేడుకల్లో పాల్గొనాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. మునిసిపల్ కార్యాలయం నుండి ఊరేగింపుగా వెళ్లి వినాయక సాగర్‌లో నిమజ్జనం చేశారు. అదనపు కమీషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈ విజయ కుమార్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌ఓలు సేతుమాధవ్, కెవెల్.వర్మ, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి, ఇందిరానగర్ రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయంలో రాస్- జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో రెండు బ్యాచ్ లకు రాష్ట్రీయ సేవా సమితి (రాస్) పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు, కెనరా బ్యాంక్ కరకంబాడి శాఖ మేనేజర్ సిద్ధు, జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్ మోహన్ ఉచిత టైలరింగ్ శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు స్వయం ఉపాధి పై అనేక రకాల శిక్షణలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణా సంస్థాన్ కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, ట్రస్టీలు రమేష్ రెడ్డి, సుబ్బరత్నమ్మ, నిత్యసుధా , ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్నలగన్, ఇందుమతి ,నాగమణి స్వాతి, శంకరయ్య, క్లస్టర్ లీడర్లు, 120 మంది మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతానికి చెందిన మల్లి శ్రావణి ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్ విద్యార్థిని చదువుకు 25 వేల రూపాయలను స్థానిక మాజీ వైస్ ఎంపిపి మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ తండ్రిని కోల్పోయి చదుకునే స్తోమతలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మల్లి శ్రావణి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే నిలిచారు అన్నారు. అనంతరం విద్యార్థిని మల్లి శ్రావణి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు.

పూల తోటల పెంపకం చేపట్టండి :డ్వామా పీ.డీ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని నచ్చనేరి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సివి శ్రీనివాస్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీలోని ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పండ్లు, పూల తోటలు పెంపకానికి సంబంధించి వివరాలను తెలిపి అధికారులకు మండలంలో ప్రతి పంచాయతీలలో పండ్లు, పూల తోటల పెంపకం చేపట్టేందుకు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధి కారులు చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, జూనియర్ ఇంజనీర్ బాలాజీ రావు,మేట్స్ ప్రసాద్, పాండు మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా మిథున్ రెడ్డి జన్మదినం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు వైసిపి కార్యాలయంలో మండల మాజీ పార్టీ కన్వీనర్ కె టి హరిశ్చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మాజీ మండల పార్టీ కన్వీనర్ కెటి హరిశ్చంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవలో అలుపెరగని ప్రజా నాయకులు, ప్రతి నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం కష్టపడే తమ నాయకులు పుట్టిన రోజు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ కేజీ రోస్, భూపతి, పాండియన్, గోవిందన్, వేలు, కుమ్మరేష్, అయ్యప్ప, రమేష్, వెంకటయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

క్యాంపస్ : రాజంపేట పార్లమెంట్ సభ్యులు, వైసిపి పార్లమెంట్ ఫ్లోర్ కమిటీ నాయకుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి 47వ జన్మదినాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట వైయస్సార్ విద్యార్థి విభాగం రాయలసీమ విద్యార్థి విభాగం ఇన్‌ఛార్జి హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. భారీ ఎత్తున 60 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మిథున్‌రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థి నాయకులు హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ కోసం కృషిచేసే మిథున్‌రెడ్డికి తాము తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్, జిల్లా నాయకులు వీరేంద్ర వర్మ, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోపణలపై దర్యాప్తు చేయండి..

పోలీసులకు దళిత సంఘం వినతి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై కుట్రకోణం దాగి వుందని దీనిపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ ఎస్ఐ విశ్వనాథనాయుడుకు దళిత సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను నిరసిస్తూ అందులో దాగివున్న కుట్రను బయటికి తీసి న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల దళిత నాయకులు పాల్గొన్నారు. స్పందించిన ఎస్ఐ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎస్పి దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల దళిత నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ.300 ఇవ్వాలి: పీడీ

ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: ఉపాధి కూలీలకు రోజుకు 300 రూపాయలు తగ్గకుండా కూలి వచ్చే విధంగా పని కల్పించాలని పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఇనగలూరు పంచాయతీలో ఊట గుంటల ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని కోరారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో టెంట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు చేకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్తగా నియమితులైన మేట్‌కి సూచనలు, సలహాలు తెలపడంతో పాటు ఉపాధి పనికి వచ్చిన ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కూలీలతో మాట్లాడుతూ వంద రోజులు పని పూర్తయ్యే వరకు మొత్తం 30 వేల రూపాయలు ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈశాన్య రుతుపవనాలు వచ్చేలోపు ప్రతి కుటుంబం వంద రోజుల పని పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలం ఏపీవో దినేష్, టిఏలు పాల్గొన్నారు.

'ఎస్‌సి వర్గీకరణ విరమించుకునే వరకు ఉద్యమం'

ప్రజాశక్తి -కోట: భారతదేశం వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ పూర్తిగా అంతమయ్యే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు, న్యాయవాది మోహన్ అంబేద్కర్, అరవ పార్థసారథి, విజయకుమార్ లు అన్నారు. బుధవారం కోట మండలంలోని కోట క్రాస్ రోడ్డు నుండి కోట అంబేద్కర్ విగ్రహం వరకు భారీ సంఖ్యలో నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అరవ పార్థసారథి, న్యాయవాది మోహన్ అంబేద్కర్, విజయ కుమార్‌లు హాజరయ్యారు. ముత్యాలమడుగు కోట క్రాస్ రోడ్ లో కోట వాకాడు చిట్టమూరు మండలాల నుండి వచ్చిన మాలలందరూ ఏకమై ర్యాలీగా కోట మహాత్మా గాంధీబొమ్మ వరకు చేరుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, డాక్టర్ రామకృష్ణయ్య, డాక్టర్ రవికుమార్, ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మిజూరు మాధవ్ పాల్గొన్నారు.

వైసిపి ఆగడాలను అడ్డుకుంటాం..

భూ బాధితులను ఆదుకుంటామని జనసేన భరోసా

ప్రజాశక్తి -రామచంద్రాపురం: వైసిపి ఆగడాలను అడ్డుకుని భూ బాధితులకు అండగా నిలుస్తామని జనసేన నాయకులు తెలిపారు. తిరుపతి జిల్లా భూ బాధితులకు అండగా నిలబడతానే తప్ప కబ్జా ఆరోపణలు చేయడం దుర్మార్గమని చంద్రగిరి నియోజకవర్గం జనసేన ఇన్ ఛార్జ్ దేవర మనోహర్ మండిపడ్డారు. బుధవారం జనసేన నేతలు, భూ బాధితులతో కలిసి తిరుచానూరులో అన్యాక్రాంతమైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులతో కలిసి అన్యాక్రాంతమైన ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళితే వైసీపీ కబ్జా దారులు అడ్డుకునేలా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనీతి, అక్రమాలతో నిండిపోయిన వైసీపీ ప్రభుత్వం మారితే న్యాయం జరుగుతుందని ఎదురు చూసిన భూ బాధితులు రాజేంద్ర ప్రసాద్ న్యాయం జరిగేలా లేదని వాపోయారు. బాధితుల కోసం జనసేన పోరాడి అండగా నిలబడతామని స్పష్టం చేశారు. పక్కా రికార్డ్ తో కొనుగోలు చేసిన భూమిని ఆనుకుంటున్న చెందిన వైసీపీ నేత సుధాకర్ రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. నకిలీ పత్రాలతో ఇంటి పన్ను, కరెంట్ మీటర్లు అమర్చుకున్నారని వ్యాఖ్యానించారు. డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి బాధితుని న్యాయం చేస్తామన్నారు. న్యాయం జరగకపోతే అమరణ నిరాహార దీక్షకు సిద్ధమని స్పష్టం చేశారు.

రైతు సేవా కేంద్రం చిరునామా ఎక్కడ?

మండల రైతుల వెతుకులాట

ప్రజాశక్తి -రామచంద్రాపురం: దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలకు వ్యవసాయ సాగులో పలు సూచనలు, సలహాలు ఇచ్చే వ్యవసాయ అధికారి కార్యాలయం చిరునామా తెలియడంలేదు. దీంతో రామచంద్రాపురం మండల రైతులు ' వ్యవసాయ అధికారి కార్యాలయం చిరునామా ఎక్కడ ?' అంటూ ప్రశ్నిస్తున్నారు. పుత్తూరు సమితిగా ఉన్న కాలంలోనే రామచంద్రాపురంలో వ్యవసాయ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. అందులో వ్యవసాయ శాఖ అధికారులు విధులు నిర్వహించాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పని చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షం పడితే మొత్తం ఉరుస్తోంది. ఆ కార్యాలయ భవనం స్లాబ్ నుండి పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఈ కారణంగా ఆ కార్యాలయాన్ని ఖాళీ చేసి చుట్టుగుంట రామాపురంలో ఉన్న రైతు సేవా కేంద్రానికి వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి కార్యాలయాన్ని మార్చేశారు. దీంతో వ్యవసాయ అధికారిణి కార్యాలయం ఎక్కడో తెలియక మండల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అనుపల్లి, పరమాల, రావిళ్ళవారిపల్లి గ్రామాల నుంచి వచ్చే రైతులు మండల కేంద్రమైన ఆర్‌సిపురంలో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం లేక పోవడంతో చిరునామా వెతుక్కుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, మండల ప్రజా ప్రతినిధులు స్పందించి మండల కేంద్రమైన రామచంద్రాపురంలో పాత భవనాన్ని కూల్చి కొత్త భవనానికి నిధులు మంజూరు చేసి వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని నిర్మించి రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

మూతపడిన రైతు సేవా కేంద్రం పాత కార్యాలయం

ఏపీఆర్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏపీ ఆర్ సెట్ 2023 -24 అడ్మిషన్ల కన్వీనర్ గా ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారిని కన్వీనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఏపీ ఆర్ సెట్ ప్రవేశ పరీక్షలు పూర్తి అయి, ర్యాంకులు ప్రకటించారు. ఈ క్రమంలో అడ్మిషన్లు నిర్వహించాల్సి వుంది. గతంలోనూ ఏపీ ఆర్ సెట్ -2021 కో- కన్వీనర్ గా ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు వ్యవహరించిన అనుభవం వుంది. ఈ నేపథ్యంలో ఈ రోజు అమరావతిలో ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 15 వ తేదీ నుంచి తొలిదశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే విధంగా నిర్ణయం తీసుకున్నారని, ఈ నెలాఖరులోగా తొలిదశ అడ్మిషన్లు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఏపీ ఆర్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ తెలిపారు.

పిహెచ్‌సికి ఇసుజు వితరణ

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా సుమారు 4 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వితరణ ఇచ్చింది. బుధవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలో ఇసుజు వైస్ ప్రెసిడెంట్ సెంథిల్ మనోహర్, జనరల్ మేనేజర్ తకాషి రికుకావా, శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్ కుమార్ సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు పరికరాలు అందచేశారు. వీటిలో ఏసి, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్, ఆపరేషన్ టేబుల్, స్ట్రెచర్ ట్రాలీ, బిపి యంత్రాలు, వాక్యూమ్ క్లీనర్లు, సెలైన్ స్టాండ్లు, ఇతర పరికరాలు వున్నాయి. ఇసుజు సీఎస్సార్ చొరవను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినం దించారు. శ్రీసిటీ, పొరుగు ప్రాంతాలలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి శ్రీసిటీ పరిశ్రమల సహకారంతో తాము నిరంతరంగా కృషి చేస్తామన్నారు. వితరణ వైద్య పరికరాల ద్వారా పేద రోగులకు మరింత మెరుగైన వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీ నిరంతర సహకారానికి ఆసుపత్రి వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఇసుజు, చిన్న పాండూరు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -దొరవారిసత్రం: 35 ఏళ్లు దాటిన మహిళలందరూ తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపు నిచ్చారు. దొరవారి సత్రం పిహెచ్‌సి పరిధిలోని తనియాళి గ్రామ సచివాలయంలో బుధవారం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. పింక్ బస్సును పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా కొనసాగుతోందన్నారు. క్యాంపునకు విశేషంగా ప్రజలు విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారని వివరించారు. పింక్ బస్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, దొరవారిసత్రం పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ వి.చైతన్య, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.పద్మావతి, సర్పంచులు టి.సుబ్బమ్మ, ఎన్.చెంగయ్య, స్థానిక నాయకులు నాగేంద్ర నాయుడు, వీరరాఘవులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక డాక్టర్ చంద్రకళ, ఎంల్‌హెచ్‌పి, జ్యోతమ్మ,ఏఎన్ఎం, హారతి, సౌజన్య, ఆశా వర్కర్లు అమరావతి, మంజుల పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని సిఐటియు, ఏఐటియుసి నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి మహేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని, రోజు రోజుకు పరిస్థితి దిగజారి పోతోందన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నిచర్ గతంలో ఒక బ్లాస్ట్ మూతపడగా ఇప్పుడు మరో బ్లాస్ట్ ఫర్నిచర్ కూడా మూత పడిందన్నారు. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు ఉండగా, గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయ్యిందని, ఈ ఏడాది ఉత్పత్తి ఇంకా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పడిన నాటి నుండి కేంద్ర ప్రభుత్వం 9 వేల కోట్ల రూపాయలు మాత్రమే పెట్టుబడి పెట్టిందన్నారు. కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటి వరకు పన్నులు, డివిడెండ్ రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు చెల్లించింద న్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను సమర్థవంతంగా నడప డానికి ఎలాంటి చర్యలు చేపట్టక పోగా ప్లాంట్ ను నాశనం చేయడా నికి అన్ని ప్రయత్నాలు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం టిడిపి నాయక త్వం మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడాలని కోరారు. లేని పక్షంలో తాము ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎ విజయ్, పి భాస్కర్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య, వడమాలపేట మండల కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు యాషన్ బాష, రమేష్, కృష్ణమూర్తి, వెంకటేష్, ధన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు, ఏఐటియుసి నాయకులు

పోలేరమ్మ జాతర చాటింపు

25, 26 తేదీల్లో జాతర

ప్రజాశక్తి -వెంకటగిరి , డక్కిలి: వెంకటగిరి పోలేరమ్మ జాతరకు సంబంధించి బుధవారం అర్ధరాత్రి దేవాదాయ శాఖ అధికారులు , జాతర సంప్రదాయ నిర్వాహకుల ఆధ్వర్యంలో తొలి చాటింపు వేడుకగా నిర్వహించారు. ఈనెల 25 , 26తేదీలో నిర్వహించే జాతరకు సంబంధించి బుధవారం రాత్రి స్థానిక కాంపాళెంలో గాలిగంగుల దేవస్థానం వద్ద పూజలు నిర్వహించారు. ఆసాదుల తప్పెట్ల మోతల మధ్య గ్రామ ప్రవీధుల్లో ఊరేగింపు నిర్వహించి 'ఈనెల 25 26 తేదీల్లో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర' అంటూ కేరింతలతో స్థానికులు సందడి చేశారు. అనంతరం రాజా వీధిలోని పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటగిరి రాజాలచే తాంబూలం అందజేత

జాతరలో నిర్వహించే సంప్రదాయ నిర్వాహకులకు దేవాదాయ శాఖ అధికారులకు వెంకటగిరి రాజాకు కుటుంబీకులు డాక్టర్ విబిసాయి కృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచంద్రులు తాంబూలం అందజేసి పోలేరమ్మ జాతరను వేడుకగా నిర్వహించాలని కోరారు . ఇది తరతరాలగా జాతర సంప్రదాయంలో తొలి ఘట్టం. రెండో చాటు ఈనెల 18న వినాయక చవితి తరువాత వచ్చే తొలి బుధవారం తొలిచాటు, రెండో బుధవారం రాత్రి రెండో చాటు వేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీన జాతరకు సంబంధించి రెండో చాటు వేయనున్నారు. అనంతరం 22వ తేదీ నుంచి పట్టణంలో ఘటోత్సవం ప్రారంభం అవుతుంది. 25వ తేదీ రాత్రి అమ్మవారి నిలుపు, 26వ తేదీన నిమజ్జనం కార్యక్రమాలతో జాతర ముగుస్తుంది.

ఎన్నికల హామీలు అమలు చేయండి..

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నాగలాపురం మండల రైతు సంఘం అధ్యక్షురాలు దినమని డిమాండ్ చేశారు. సచివా లయం లోని వ్యవసాయ అధికారి సుబ్బా రావుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలలో పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి మూడు నెలలు అవుతున్నా నేటికీ ఆ హామీని నెరవేర్చలేదని, రైతులకు రూ. రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేయాలని కోరారు. గొర్రెలు, మేకలు పశువుల షెడ్లను పార్టీలకు అతీతంగా రైతులకు అందించాలని వ్యవసాయ మోటర్లకు మీటర్లు వద్దు అని జీవో 22ను వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి మురుగేషన్, సుబ్బమ్మ, గౌసియా పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని కోరుతూ వెస్ట్ వరత్తూరు గ్రామ సచివాలయ వీఆర్‌వో మురళికి సిపిఎం రైతు సంఘం నాయకులు ధనంజయులు, మల్లికార్జున్ బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లా డుతూ ఈ ఉమ్మడి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఏటా 20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు అవుతోందని, రైతులు పంట పెట్టుబడి కోసం బ్యాంకులు, ప్రయివేటు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వెంటనే ప్రభుత్వం ప్రకటించిన సాయం రైతులకు అందించి ఆదుకోవాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన రైతులకు పరిహారం, పంటల బీమా చెల్లించాలన్నారు. రూ.2 లక్షల వరకు రైతులకు రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దని, జీవో 22ను రద్దు చేయాలని డిమాండు చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గూడూరు, కెవిబిపురం, పిచ్చాటూరు, కెవిబిపురం మండలాల పరిధిలోని ప్రాజెక్టుల నుండి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయా లని, రైతులు ధాన్యం ఆరబెట్టు కునేందుకు గ్రామాల్లో కళ్లేలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.


వీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం రైతు సంఘం నాయకులు

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని గ్రామ సచివాలయాలకు జిల్లా రైతు కార్మిక సంఘం నాయకులు రైతులు, కౌలు రైతుల సమస్య లపై కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళలో హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ 20వేల రూపాయలు రైతులకు పెట్టుబడి సహాయం, 2023 లో తుపాను ప్రభావం వల్ల ఏర్పేడు మండలంలో నష్టపోయిన రైతుల పంట బీమాను, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కార్మిక సంఘం నాయకులు రంగయ్య, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి: సిడిపివో

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపరువైజర్ బేబీ రాణి పేర్కొన్నారు. నారాయణవనం మండలం ఇప్పతాంగేల్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిచ్చాటూరు ఐసిడిఎస్ సూపరు వైజరు బేబీ రాణి, ఏపిఎం మమత విచ్చేశారు. ఈ సందర్భంగా సూపరు వైజరు మాట్లాడుతూ చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం, కూర గాయలు, ఆకుకూరలు, పళ్లు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డకు రక్షణ కల్పిస్తుందని, బిడ్డ పుట్టిన అర్ధగంట లోపే తల్లులకు వచ్చే ముర్రపాలు బిడ్డకు అందిస్తే రోగ నిరోధక శక్తి లభిస్తుందన్నారు. తల్లి బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు తల్లిపాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం చంగల్ రాయులు అంగన్‌వాడీ కార్యకర్త వాణి, గర్భిణులు, బాలింతలు, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ ప్రభుత్వాస్పత్రిలో బుధవారం వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకుంటే రక్తహీనత, ఎయిడ్స్ వంటి వ్యాధుల గురించి తెలుస్తుందన్నారు. దీంతో గర్భిణులు మందులు వార్డు వాడితే శిశువు ఆరోగ్యంగా, క్షేమంగా ఉంటుందని తెలి పారు. ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చే మాత్రలను క్రమం తప్పకుండా వాడాలన్నారు. మండలంలోని భవాని శంకరాపురం పంచాయతీలో బుధవారం ఉదయం తల్లిపాల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిశువు పుట్టిన గంటలోపేలోపే ముర్రపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డలకు పాలు తాగించాలని ఐసీడీఎస్ సూపరువైజరు శిల్ప తెలిపారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని యువకుడి మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ పరిధిలోని చల్ల కాలువ బ్రిడ్జి సమీపంలోని పొలాలలో గుర్తు తెలియని యువకుడు మృత దేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు..మృతుడు వయసు (25) సంవత్సరాలు వుంటుందని మృతదేహంపై అక్కడక్కడ గాయాలు, తలకు గాయ మై వుందన్నారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 22 మందికి రెండు లక్షల ఇరవై వేల రూపాయలు జరిమానా విధిస్తూ నాలుగోవ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి గంది శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. తిరుపతి పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనా లు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 22 మంది నిందితులను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతిలో హాజరు పరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 22 మందికి జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పి హెచ్చరించారు.

దొంగ అరెస్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకాళహస్తిలో రాజకీయ ప్రముఖులతో పాటు పలు ప్రయివేట్ కంపెనీల నుంచి మోసపూరితంగా డబ్బు కొట్టేసిన హేమ చంద్రారెడ్డి అనే దొంగను మంగళవారం రాత్రి వన్ టౌన్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆయనను సుదీర్ఘంగా విచారించి పలు రకాల సీఆర్పీసీ చట్టాల కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ గోపీ కథనం మేరకు.. పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన హేమచంద్రా రెడ్డి ఇటీవల తన పేరిట ఉన్న బంగారం పలు ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టులో వుందని, ఎవరైనా విడిపించి తీసుకొస్తే వాటిని వారికే విక్రయిస్తానని నమ్మ బలికి పలు ఫైనాన్స్ కంపెనీల వద్ద డబ్బులు తీసుకున్నాడు. తీరా వారికి బంగారం విక్రయించక, నగదు ఇవ్వక టోకరా పెట్టాడు. దీంతో ఆయా ఫైనాన్స్ కంపెనీలు హేమచంద్రా రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ దొంగను మంగళవారం పట్టుకున్నారు. ఈయన ఎన్నికల ముందు శ్రీకాళహస్తి దేవస్థానం వెండిని అప్పటి ఎమ్మెల్యే తన వద్ద విక్రయించాడు..' అంటూ మీడియాకు ఎక్కడం అప్పట్లో పెద్ద సంచలంగా మారింది. ఎన్నికల ఫలితాలు రాగానే టక్కరి దొంగ అవతారమెత్తి అందర్నీ బురిడీ కొట్టించడం గమనార్హం.

బైక్‌ఢీ..ఒకరు మృతి

ప్రజాశక్తి-తడ: బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. తడ మండలం లోని బొడిలింగాల పాడు వద్ద నేషనల్ హైవే పక్కన బైక్‌పై విష్ణు నిలిచి వుండగా సూళ్లూరుపేట నుండి తడకు బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో పవన్ కళ్యాణ్ అలియాస్ విష్ణు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. తడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి , 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి కొర్లగుంట మారుతి నగర్‌కు చెందిన శ్రీనివాసులు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నా మన్నారు. అతని వద్ద 62 లక్షల రూపాయలు విలువ చేసే 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు తనపై కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలించామని తెలిపారు. నిందితుడు అరెస్టుకు సహకరించిన పోలీస్ సిబ్బందిని అయన అభినందించారు.

సెమికాన్-2024 తో మంచి అవకాశాలు : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : సెమికాన్-2024 తో కేంద్ర ప్రభుత్వం మంచి ఉన్నతమైన అవకాశాన్ని కల్పించేందుకు అవకాశం ఏర్పడిం దని విసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. ప్రధాని మోడీ ఢిల్లీలో ప్రారంభించిన సెమికాన్-2024 జాతీయ ఆవిష్కరణలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీయూ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య తులసి రామకృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. దామోదరరెడ్డి. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ), మెకానికల్ ఇంజినీరింగ్, ఫిజిక్స్ తదితర విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సెమికాన్-2024 ప్రారంభంతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వేగంగా అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ పరిశ్రమలో తన విద్యార్థులకు కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవకాశం లభిస్తుందని, విశ్వవిద్యాలయం అత్యాధునిక పరిశోధనలను పెంపొందించడానికి , పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి ఉపకరిస్తుందని, ఈ చొరవ విద్యార్థులకు సెమీకండక్టర్ రంగంలో సహకారాలు, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలను అన్వేషించడానికి తలుపులు తెరుస్తుందన్నారు.

గాయపడ్డ వ్యక్తికి పరామర్శ

ప్రజాశక్తి -సత్యవేడు: ప్రమాదంలో గాయపడ్డ వెంకటేష్‌ను జనసేన నాయకులు కురాకుల రూపేష్ బుధవారం పరామర్శించారు. సత్యవేడు మండలం అమావాస్య రెడ్డి కండ్రిగ పంచాయతీ ఎస్‌టి కాలనీలో నివసిస్తున్న వెంకటేష్ ప్రమాదానికి గురై కాలు విరిగి మంచాన పడ్డారు. సమాచారం తెలుసుకున్న జనసేన సత్యవేడు మండల అధ్యక్షులు కురాకుల రూపేష్ బాధితుడి ఇంటికి వెళ్లి పరా మర్శించారు. గాయపడ్డ వ్యక్తికి బీమా వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సత్యవేడు మండ ల జనసేన సెక్రటరీ అనిల్ కుమార్, ఆర్గనైజర్ సెక్రటరీ ధనుష్ , పవన్, కళ్యాణ్, ముని కుమార్ పాల్గొన్నారు.

గంగ జాతర వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక గేటు పుత్తూరులో నిర్వహిస్తున్న గంగ జాతర వేడుకలకు నగరి నియోజక వర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, పుత్తూరు పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. వారికి ఆలయ కమిటీ నిర్వాహకులు దుశ్శాలువాతో, గజమాలతో ఘన స్వాగతం పలికారు.

PUBLICATION MATTER BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL -cum- XII ADJ : SRIKALAHASTI
MVOP.NO. 2 OF 2024
D.Janardhan Reddy ...Petitioner
V/s
K.Prabahakar & others ...Respondents
NOTICE TO RESPONDENT NO.1
K.Prabhakar, S/o K.Raghavulu Ozili village and mandal, SPSR Nellore District Now at Cherlopalli H.W., Srikalahati Mandal
Please TAKE NOTICE that the above O.P. filed by the petitioner under section 166(1)(a) of M.V.Act against you and others for compensation and the above O.P. is posted to **20.09.2024** for your appearance. Please attend on that day before the above said court by 10.30 a.m., either you or through an Advocate and file your objections if any. Otherwise the matter will be decided exparte.
Hearing Date 20.09.2024
O.RAJAMANIKYAM
R.KALYANI
Advocates for Petitioners Tirupati

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P.No. 31/24
ఉల్లగంటి. ఆంజనేయులు, S/o చిన్నరెడ్డెన్న, హిందు, వయస్సు 32 సం॥లు, డోర్‌నెం.16-173-సి, గుట్టక్రింద రాచపల్లె, H/o. మడితాడు గ్రామం, టి.సుండుపల్లి మండలం. ...పిటీషనర్
Vs
ఉల్లగంటి క్రిష్ణవేణి @ క్రిష్ణకుమారి, D/o. ఏపూరి వెంకట సుబ్బయ్య, హిందు, వయస్సు 30 సం॥లు, భర్త పోషణ, చావనవారిపల్లె, H/o గోపమాంబపురం, రాజంపేట మం॥, ప్రస్తుతం, డోర్ నెం.12/608, సప్తగిరి కాలనీ, మంగలం, తిరుపతి టౌన్ & జిల్లా. ...రెస్పాండెంటు
నోటీసుకు ప్రకటన
పై నెంబరు దావాలో పిటీషనరు, రెస్పాండెంటు అయిన నీ పైన విడాకులను కోరి పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో మీరు 24.9.2024 తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ వకీలు ద్వారా గాని హాజరై హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.
ఆర్.వీరభద్రయ్య
పిటిషనరు పరం అడ్వకేటు,
రాయచోటి. సెల్: **8919598646, 9441794038.**